నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4 PM



# ఏపీ ఎన్నికల్లో కూటమికి తొలి విజయం

ఏపీలో కూటమికి తొలివిజయం నమోదయ్యింది. రాజమండ్రి రూరల్‌లో టీడీపీ అభ్యర్థి గోరంట్ల బచ్చయ్య చౌదరి బంపర్ మెజార్టీతో గెలుపొందారు. గోరంట్లకు 63,056 ఓట్ల మెజారిటీ వచ్చినట్లు తెలిసింది. ఇక ఆంధ్రాలో కూటమి స్వీప్ చేసిందనే చెప్పాలి. ఇప్పటివరకు అందుతున్న రిపోర్ట్ ప్రకారం.. టీడీపీ 130 స్థానాల్లో, జనసేన 19, బీజేపీ 6 స్థానాల్లో లీడ్‌లో ఉన్నాయి. వైసీపీ కేవలం 20 స్థానాల్లో ఆధిక్యత కనబరుస్తుంది.అసెంబ్లీ ఎన్నికల్లో తెదేపా, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ విజయం దిశగా దూసుకుపోతున్నారు. మంగళగిరి నుంచి పోటీ చేసిన నారాలోకేష్, హిందూపూర్ టీడీపీ అభ్యర్థి బాలకృష్ణలు సైతం విజయం వైపు పయనిస్తున్నారు. కాగా ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కూటమి స్వీప్ చేసేలా కనిపిస్తుంది. ఇక బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, బుగ్గన రాజేంద్రనాథ్ అంజాద్ బాషా, ఉషశ్రీ చరణ్, పీడిక రాజన్న దొర , కొట్టు సత్యనారాయణ, గుడివాడ అమర్నాథ్, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, దాడిశెట్టి రాజా, అంబటి రాంబాబు , విడదల రజిని, ఆది మూలపు సురేష్ , మేరుగు నాగార్జున తదితర మంత్రులు ఓటమికి చేరువలో ఉన్నారు.



# వైఎస్ జగన్ రాజీనామా

వైసీపీ ఘోర పరాజయం పాలు కావడంతో జగన్మోహన్ రెడ్డి తన ముఖ్యమంత్రి పదవికి రాజినామా చేయనున్నారు. ఆయన కాసేపట్లో గవర్నర్ ను కలిసి రాజీనామా పత్రం ఇచ్చే అవకాశం ఉంది. వైసీపీకి ఈ సారి ప్రతిపక్ష హోదా కూడా దక్కే అవకాశం లేకుండా పోయే అవకాశం కనిపిస్తోంది.రెండో సారి అధికారంలోకి రావాలనుకున్న జగన్..అన్ని ప్రయత్నాలు చేశారు.కానీ... పాలన గురించి పట్టించుకోకుండా పూర్తిగా బటన్లు నొక్కి అప్పులు చేసి పంచడం మీదే దృష్టి కేంద్రీకరించడంతో ప్రజలు భిన్నమైన తీర్పు ఇచ్చారు. ఈ ఫలితం వైసీపీ పెద్దలందర్నీ దిగ్భ్రాంతికి గురి చేస్తోంది.



## ఎన్డీయే VS ఇండియా కూటమి హోరాహోరీ
# కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

ఎగ్జిట్ పోల్స్‌కు భిన్నంగా లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే, ఇండియా కూటమిల మధ్య హోరాహోరీ పోరుతో సోమవారం స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. సెన్సెక్స్, నిఫ్టీలు తీవ్ర ఒడిదుడుకులతో సాగుతూ ఇన్వెస్టర్లు భారీ నష్టాలు మిగిల్చాయి.అంచనాలకు విరుద్ధంగా ఎన్డీయే, ఇండియా కూటముల మధ్య భీకర పోరు సాగుతుండటం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను ప్రభావితం చేసింది. మదుపరుల ఊగిసలాట మధ్య మార్కెట్‌లో అమ్మకాలు వెల్లువెత్తాయి. ఎస్ఈ సెన్సెక్స్ ప్రస్తుతం 5000 పాయింట్లుపైగా కుప్పకూలింది. పలు కంపెనీల షేర్లు భారీగా నష్టపోతున్నాయి. స్టాక్ మార్కెట్ల పతనంతో ఒక్కరోజే రూ. 26 లక్షల కోట్ల విలువైన సంపద ఆవిరైంది.

## ఎన్డీఏకి తొలి విజయం.. 3.9 లక్షల ఓట్లతో
# అమిత్ షా ఘన విజయం

ఎన్డీఏ కూటమికి తొలి విజయం దక్కింది. గుజరాత్‌లోని గాంధీనగర్ నుంచి పోటీచేస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా గెలుపొందారు. తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి సోనాల్ రమణ్‌భాయ్‌పై 3,96,512 ఓట్ల తేడాతో విజయం సాధించారు. మొత్తం పోలైన ఓట్లలో అమిత్ షాకు 5,06,731 ఓట్లు రాగా, రమణ్‌భాయ్‌కి 1,10,219 ఓట్లు పోలయ్యాయి. ఇక బహుజన్ సమాజ్‌వాదీ పార్టీకి చెందిన మహమ్మద్ అనీశ్ దేశాయ్‌కి డిపాజిట్ దక్కలేదు. ఆయనకు 3,244 ఓట్లు మాత్రమే వచ్చాయి.కాగా, కేంద్రంలో ఎన్డీయే మరోసారి ప్రభుత్వ ఏర్పాటు దిశగా కొనసాగుతున్నది. ఇప్పటివరకు 297 చోట్ల ఎన్డీఏ కూటమి ఆధిక్యంలో కొనసాగుతుండగా, ఇండియా బ్లాక్ 225 స్థానాల్లో మెజార్టీలో ఉన్నది. ఇప్పటివరకు ఇరు కూటములు ఒక్కో చోట విజయం సాధించారు. మరో 19 సీట్లలో ఇతరులు ఆధిక్యంలో కొనసాగుతున్నారు.





# పంజాబ్‌లో ఖాతా తెరవని బీజేపీ.. మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్

పంజాబ్ ఓటర్లు బీజేపీకి షాకిచ్చారు. రాష్ట్రంలో మొత్తం 13 స్థానాల్లో ఆ పార్టీ పోటీచేసిన ఒక్క చోట కూడా ఖాతా తెరవలేకపోయింది. కాంగ్రెస్ 7 చోట్ల ఆధిక్యంలో ఉండగా, 3 స్థానాలతో సరిపెట్టుకుంది. ఇక శిరోమణి అకాలీదళ్ ఒక స్థానంలో, ఇండిపెండెంట్లు 2 చోట్ల లీడ్‌లో ఉన్నారు. రైతు చట్టాలు తీసుకొచ్చిన బీజేపీపై పంజాబ్ ఓటర్లు తీవ్ర ఆగ్రహంతో ఉండటంతో తాజా ఫలితాల్లో అది ప్రతిఫలిస్తున్నది. కాగా, దేశవ్యాప్తంగా ఎన్డీఏ 296 స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా, ఇండియా కూటమి 226 చోట్ల లీడ్‌లో ఉన్నది. ఇప్పటివరకు ఇరు కూటములు ఒక్కో స్థానాల్లో విజయం సాధించాయి. ఇక ఇతరులు 19 స్థానాల్లో మెజార్టీలో ఉన్నారు.

# 'ఏపీలో కేకపుట్టించిన కేకే సర్వే

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి 150కి పైగా సీట్లు వస్తాయని కేకే సర్వే అంచనా వేసింది. ఇక ఈ సర్వే చూసి అటు వైసీపీ నాయకులు.. అసలు ఈ సర్వే ఎక్కడిది.? ఎవరు నమ్మలేరని.? అని అంటూ విమర్శలు గుప్పించారు. కానీ ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు చూస్తే.. ఆ సర్వే అంచనాలు నిజమయ్యేయని చెప్పొచ్చు. ప్రస్తుతం ఉన్న ట్రెండ్స్ బట్టి వైసీపీ 19 స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా.. కూటమి 156 స్థానాల్లో ఆధిక్యతను చూపిస్తోంది. దీంతో ప్రస్తుతం ఆయన గురించే సోషల్ మీడియాలో తెగ చర్చ జరుగుతోంది. 'ఎవరు బ్రో నువ్వు ఇంత టాలెంటెడ్‌గా ఉన్నావు..' అంటూ కామెంట్స్ రూపంలో తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు నెటిజన్లు. కొందరు వైసీపీ వస్తుందని అంచనా వేస్తుంటే.. ఇంకొందరు టీడీపీ కూటమి వస్తుందని అంచనా వేశారు. కానీ కేకే సర్వే ఒక్కడే ఏపీలో కూటమి సునామీని ఊహించారని పొగడ్తలతో ముంచెత్తారు.

కేకే సర్వే అంచనా ఇదే..

టీడీపీకి 144 స్థానాలలో 133 స్థానాలు కైవసం చేసుకుంటుందని స్పష్టం చేశారు. అలాగే జనసేన 21 స్థానాల్లో 21 స్థానాల్లో విజయం సాధిస్తుందని.. పది స్థానాలకు గానూ
ఏడు స్థానాలు బీజేపీ గెలుపొందుతుందని కేకే సర్వే చెప్పింది. అటు వైసీపీ 175 స్థానాలలో కేవలం 14 సీట్లు మాత్రమే




| | గెలిచేవి / పోటీ చేసేవి (వైసీపీ) | గెలిచేవి / పోటీ చేసేవి (టీడీపీ) | గెలిచేవి / పోటీ చేసేవి (జనసేన) | గెలిచేవి / పోటీ చేసేవి (బీజేపీ) |
|---|---|---|---|---|
| శ్రీకాకుళం | 00 / 10 | 08 / 08 | 01 / 01 | 01 / 01 |
| విజయనగరం | 00 / 09 | 08 / 08 | 01 / 01 | 00 / 00 |
| విశాఖపట్నం | 01 / 15 | 09 / 09 | 04 / 04 | 01 / 02 |
| తూర్పుగోదావరి | 01 / 19 | 12 / 13 | 05 / 05 | 01 / 01 |
| పశ్చిమగోదావరి | 00 / 15 | 09 / 09 | 06 / 06 | 00 / 00 |
| కృష్ణ | 00 / 16 | 13 / 13 | 01 / 01 | 02 / 02 |
| గుంటూరు | 00 / 17 | 16 / 16 | 01 / 01 | 00 / 00 |
| ప్రకాశం | 01 / 12 | 11 / 11 | 00 / 00 | 00 / 00 |
| నెల్లూరు | 02 / 10 | 08 / 10 | 00 / 00 | 00 / 00 |
| చిత్తూరు | 03 / 14 | 10 / 13 | 01 / 01 | 00 / 00 |
| అనంతపురం | 00 / 14 | 13 / 13 | 00 / 00 | 01 / 01 |
| కడప | 03 / 10 | 05 / 07 | 01 / 01 | 01 / 02 |
| కర్నూలు | 03 / 14 | 11 / 13 | 00 / 00 | 00 / 01 |
| మొత్తం సీట్లు | 14 / 175 | 133 / 144 | 21 / 21 | 07 / 10 |

COMMITTED NUMBERS

పరిమితమవుతుందని పేర్కొన్నారు. తాజాగా ట్రెండ్స్ చూస్తే.. వైసీపీ 19 స్థానాల్లో, టీడీపీ 130 స్థానాల్లో, బీజేపీ 7 స్థానాల్లో, జనసేన 19 స్థానాల్లో లీడింగ్‌లో ఉన్నాయి. దీన్ని బట్టి.. అటు.. ఇటుగా కేకే సర్వే మొత్తానికి కచ్చితమైన ఎగ్జిట్ పోల్స్ చెప్పి.. అందరినీ ఆశ్చర్యానికి గురి చేసిందని చెప్పాలి.




# ఓటమిని అంగీకరించిన రోజా

ఏపీలో వన్‌సైడెడ్‌గా కూటమి అభ్యర్థులు విక్టరీ దిశగా దూసుకుపోతున్నారు. దాదాపుగా అన్ని జిల్లాల్లోనూ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి క్లీన్ స్వీప్ దిశగా వెళ్తోంది. ఇదిలా ఉంటే.. వైసీపీ మంత్రులు పోటీ చేస్తోన్న నియోజకవర్గాల్లో.. ఆ పార్టీకి పరాభవం ఎదురైంది. అందరు మంత్రులు ఓటమికి అంచు దూరంలో ఉన్నారు. ఇక నగరిలో మంత్రి ఆర్‌కే రోజా తన సమీప టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాశ్‌పై 5333 ఓట్ల తేడాతో రెండో స్థానానికి పరిమితమైంది. టీడీపీ అభ్యర్థి ముందంజలో ఉండగా.. రోజా ఓటమి దిశగా పయనిస్తున్నట్టు ట్రెండ్స్ చెబుతున్నాయి. ఈ తరుణంలో రోజా తన ఓటమిని అంగీకరిస్తూ.. ఎక్స్ వేదికగా ఫలితాలపై ఆసక్తికర ట్వీట్ చేశారు. చిరునవ్వులు చిందిస్తున్న తన ఫోటోను పంచుకుంటూ.. 'భయాన్ని విశ్వాసంగా... ఎదురు దెబ్బలను మెట్లుగా.. మన్నింపులను నిర్ణయాలుగా.. తప్పులను పాఠంగా నేర్చుకుని, మార్చుకునే వాళ్లే శక్తిమంతమైన వ్యక్తులుగా మారతారు' అంటూ ఆ ఫోటోకి క్యాప్షన్ ఇచ్చారు. కాగా, ప్రస్తుతం ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



## చంద్రబాబుతో భేటీ కానున్న
# కేసీ వేణుగోపాల్?

టీడీపీ అధినేత చంద్రబాబుతో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ భేటీ కానున్నట్టు సమాచారం. ఎన్డీయేను 300 సీట్లు దాటనివ్వకుండా శాయశక్తులా కృషి చేస్తున్న ఇండియా కూటమి తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన బలాన్ని సంపాదించే పనిలో పడింది. అందులో భాగంగానే చంద్రబాబును వేణుగోపాల్ కలవనున్నట్టు తెలిసింది. ఇప్పుడు ఈ భేటీకి దేశవ్యాప్తంగా రాజకీయ ప్రాధాన్యత ఏర్పడింది.



## ఓ పోలింగ్ కేంద్రంలో తమిళనాడు బీజేపీ చీఫ్
# అన్నామలైకి ఒక్కటే ఓటు..!

తమిళనాడులో బీజేపీ విజయం కోసం తీవ్రంగా శ్రమించిన ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ఓటమి దిశగా సాగుతున్నారు. కోయింబత్తూరు నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగిన అన్నామలైపై డీఎంకే అభ్యర్థి గణపతి రాజ్‌కుమార్ ఆధిక్యంలో ఉన్నారు.ప్రస్తుతం అన్నామలైపై గణపతి రాజ్‌కుమార్ 17,486 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. గణపతి రాజ్‌కుమార్‌కు మొత్తం 76,291 ఓట్లు పోలవగా, అన్నామలైకి 58,805 ఓట్లు వచ్చాయి. అయితే నియోజకవర్గంలోని ఓ పోలింగ్ కేంద్రంలో అన్నామలైకి కేవలం ఒకే ఒక్క ఓటు పోలైంది. పోటీలో రెండో స్థానంలో కొనసాగుతున్న అన్నామలైకి ఓ పోలింగ్ బూత్‌లో ఒక్కటే ఓటు పడటం గమనార్హం.



## నితీశ్‌ను లాగేయడం
# కలిసొచ్చింది!

రాజకీయ రణరంగంలో ఎత్తుకు పైఎత్తులు వేయడం ఎంత ముఖ్యమో మళ్లీ నిరూపణ అయింది. బిహార్‌లో నితీశ్‌ను తమవైపు తిప్పుకోవడం బీజేపీకి చాలా కలిసొచ్చింది. లేదంటే యూపీ తరహాలో ఇక్కడా దెబ్బపడేది. ఈ రాష్ట్రంలో కులాలకు చాలా ప్రాధాన్యం ఉంది. ఈసీ వెబ్‌సైట్ ప్రకారం మొత్తం 40 సీట్లలో ఎన్డీయే పార్టీలైన జేడీయూ 15, బీజేపీ 13, ఎల్‌జేపీ 5 చోట్ల ఆధిక్యంలో ఉన్నాయి. ఇండియా కూటమి 6 స్థానాల్లో పోటీలో ఉంది.




## హసన్‌లో
# ప్రజ్వల్ రేవణ్ణ ఓటమి

సెక్స్ స్కాండల్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు, జేడీఎస్ సిట్టింగ్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ తన సొంత నియోజకవర్గం హసన్‌లో ఓటమి పాలయ్యారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి శ్రేయస్ ఎం పాటిల్ 44,000 ఓట్ల తేడాతో ప్రజ్వల్‌పై గెలుపొందారు. కౌంటింగ్ ప్రారంభమైన సమయంలో ప్రజ్వల్ ఆధిక్యంలో కొనసాగిన విషయం తెలిసిందే. ఆ తర్వాత వెనుకంజలోకి వెళ్లిపోయారు. ఇప్పుడు 44 వేల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 1.4 లక్షల మెజారిటీతో హసన్ నుంచి ప్రజ్వల్ గెలుపొందిన విషయం తెలిసిందే. ఇక ఈసారి కర్ణాటకలో బీజేపీతో పొత్తుతో జేడీ(ఎస్) కర్ణాటకలో పోటీ చేసింది.



## 'ఇక మీదట ప్రెడిక్షన్స్ చెప్పను'..
# వేణు స్వామి సంచలన నిర్ణయం

కొంతకాలంగా జ్యోతిష్యుడు వేణు స్వామిని సోషల్ మీడియాలో దారుణంగా ట్రోల్ చేస్తున్న సంగతి తెలిసిందే. దీనికి ప్రధాన కారణం ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార వైసీపీ ఘన విజయం సాధిస్తుందని.. జగన్ మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అవుతారని ఆయన పలు ఇంటర్వ్యూల్లో తేల్చి చెప్పారు. దీనిపై టీడీపీ సహా చాలా మంది నెటిజన్లు వేణు స్వామి తిడుతూ సోషల్ మీడియాలో విరుచుకుపడ్డారు. ఇక తాజాగా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎవరూ ఊహించని విధంగా కూటమి (టీడీపీ+జనసేన+బీజేపీ) విజయకేతనం ఎగురవేయడంతో వేణు స్వామి రియలైజ్ అయ్యారు. ఎన్నికల ఫలితాల గురించి ఓ ప్రత్యేక వీడియో వదిలారు.